

వేటూరి సహజ్ఞానం

ఓరే..."

"ఇదేమిట్రా...ఇలా వచ్చేశావ్?''

"నాన్న..."

"ఆ! మొన్ననేగా ఆసుపత్రిలో చేర్పించి..."

అతనేమీ మాట్లాడక, యెదురుగుండా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

నేను నిర్ఘాంతపోయి చూస్తూవున్నాను.

వాడు ఆరంభించాడు.

"అలా చూస్తూవుంటే లాభంలేదు. మీ ఆఫీసరుకు చెప్పి, వెంటనే బయలుదేరు...మరి శవ...''

వాడి స్వరంలో గాద్గదికత లేదు. అనుమతినిపొంది, నేను వాడి ననుసరించాను. ఆఫీసు గడియారం రెండు గంటలు కొట్టింది.

నాలో నేను చాలా బాధపడుతున్నాను. ఈ రెండురోజుల్లో ఒక్కసారైనా ఆసుపత్రికివెళ్ళి, రోగిని చూడలేకపోయానే అని. ఎంత పొరపాటు, ఎంత అజ్ఞానం! దైనందిన అట్టహాసంలో ఈ కొద్దిపాటి కర్తవ్యానికి కూడా అవకాశం లేకపోయింది!

దిద్దుకో వీలులేని తప్పుకు యావజ్జీ

వితం ప్రాయశ్చిత్తమే. అంతే. ఒక్కసారైనా వెళ్లి చూసివుంటే ఆ రోగి కోరేది ఇంకేమీలేదు. తనలోని దీపం ఆరిపోతున్నా, మరొక ఉజ్జ్వల దీపం కేసి చూస్తూవుంటే ఏదోతృప్తి! ప్రేమకు నోచుకోనివారికి ప్రేమ గాథలు ప్రాణప్రదమైనట్లు. అంతమాత్రపు సానుభూతి నాలో కరువైంది.

"డాక్టరు యేం ఫరవాలేదన్నాడు గదరా," అన్నాను.

"అవును..."

"మరి..."

"నాకు ఆఫీసుకు ఆసుపత్రినుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ నాన్నగారు పరమపదించారు. మీరు వెంటనే రావాలి అని!"

"అయితే నువ్వు..."

"శెలవు దొరకలేదు. పైగా ఆదుర్దా ఏమీ లేదని డాక్టరు ఉదయమే చెప్పె!"

"సమయానికి నువ్వు లేవన్నమాట ఆయన దగ్గర?"

"లేను. నే వెళ్ళేప్పటికే శవమందిరానికి మార్చారు."

బలవన్మరణంకన్న కూడా ఏకాంత మరణం మరింత ఘోరం! ఆ జీవి ఏం వినాలని, ఏం చెప్పాలని వ్యథపడి, క్షోభపడి వుంటుందో? చీకటి కమ్ముకుంటున్న ఆ సంధ్యాసమయంలో ఏ ప్రత్యక్ష ముఖం కేసో చూస్తూ, కనులు మూయాలని కాంక్షించని జీవి ఎవడుంటాడు? సర్వశక్తినీ, హరించి పోతున్న సర్వశక్తినీ శుష్కనేత్రాల్లో ఇముడ్చుకొని, ఆ సజీవ ముఖంకేసి చూస్తూవుండటమే జీవి కోరేది. కాని ఆ కోరిక, మృత్యుశయ్యపైని కోరికకూడా కొంతమందికి తీరని కోరికే. ధూళిధూసరితమై, పెనుగాలులు హోరెత్తు స్మృతి వీధిలో సలుపుపరిదేవన యమపాశపీడన కన్న కూడ క్షోభ.

వాడు నా భుజాన్ని తట్టాడు. "బావుంది. ఏమిటి ఇంకా ఏవో ఆలోచనల్లో పడ్డావు. ... ముందు కర్తవ్యం చూడాలి" అన్నాడు.

"అవును...మరి...ఆయన సదాచార సంపన్నుడు...శవ వాహకులు!!"

"అప్పుడే రెండు దాటింది. ఆకాశం అంతా మబ్బు మబ్బుగా వుంది...సాధ్యమైనంత త్వరలో......"

"సరే...అయితే... ఆసుపత్రినుంచే ఫోనుచేద్దాం...కారుకు"

కారువాడు పాతిక అడిగాడు. యాభై అడిగినా ఇచ్చేవాళ్ళమే. ఆసుపత్రి శవ మందిరపు ద్వారంలో నిలబడ్డాం.

"మీ.. అమ్మగారు" అన్నాను.

ఒక్కమాటుగా వాడి ముఖం అంతా కదలబారింది. కళ్లు నిలకడ తప్పినయ్.

"అదేరా...మరీని! ఇవాళ పొద్దున ఆవిడ ఆసుపత్రికి బయలుదేరుతానంటే, సాయంకాలం తీసుకువెళ్తారే అని ఆపాను ...ఇప్పుడావిడకోసం మా మేనల్లుడిని

పంపాను..ఆవిడముఖం..ఎలా చూచేది?" అన్నాడు కంపిస్తున్న గొంతుతో.

ఎవడో తలపాగా చుట్టుకున్న వాడొ కడు మెల్లిగా మా ముందు ప్రత్యక్ష మయాడు. అంతకు ముందునుంచికూడా వాడు ఆ ప్రాంతాల్లోనే ఉన్నట్టు నాకు ఛాయగా గుర్తు. కాని నా చూపుగాని, ఆలోచనగాని వాడిమీదకు అంతకు మునుపుపోలేదు.

"బాబు...గారూ!''

చూశాం వాడికేసి. ఏదో ఒంటెద్దు బండివాడిలా ఉన్నాడు. ఈ సమయంలో వీడెవడు? నా కాశ్చర్యమేగాక, తీవ్ర కోపం వచ్చింది. అందుకు బహుశ నా స్వంత అశక్తతే కారణం కావొచ్చు. నిస్పృహ, అశక్తత ఎక్కువగా కోపానికి ఆజ్యం పోస్తయ్.

"అరగంటలో వెళ్లిపోతాం" అన్నాడు వాడు.

"ఎక్కడికిరా?"

నా ప్రశ్న వినిపించుకున్నట్టు లేదు వాడు.

"గిత్తండి బాబు...గిత్త...జోరుగా ఎళ్తుంది."

"వీడి బండి గోల ఏమిటి?"

''ఏమిటీ గొడవ?" అన్నాను.

వాడు జవాబు చెప్పాడు. ఒక్క అరగంటలో శవాన్ని బండిలో శ్మశానానికి చేరుస్తానంటున్నాడు. నేను, మిత్రుడు ఇద్దరం కొంచెంసేపు తెల్ల పోయాం. ఈ ఆసుపత్రి ద్వారాలనుంచి సూటిగా అంతిమయాత్ర చేసేవారి వాహన సౌకర్యం గురించి ఆలోచించి ఉంటే, బహుశ అంత ఆశ్చర్యానికి అవసరం ఉండేదికాదు. చటుక్కున వీడెవడో చిన్న రైల్వేస్టేషన్ ముందు బాడుగ మాట్లాడుతున్నంత తేలిగ్గా మాట్లాడటం నాకు చిత్రంవేసింది. గోడ అవతల ఉన్న ఒంటెద్దుబండి గూడు, ఎద్దు నల్ల మూపురం, కొమ్ములు కనపడినయ్.

"తెలిసి వచ్చావా?" అని అడిగాను.

"కాదు బాబూ! ప్రొద్దూకులా ఇక్కడే ఉంటాను."

రోజూ శవాలను జేరవేయటమే అన్నమాట నీ పని?"


"అవును...బాబూ!''

"ఇప్పటికి ఎన్ని వందలమందిని లాక్కుపోయావు?" అని అడిగాను వెటకారంగా.

వాడు పెద్దగానవ్వుతూ "అదేంటి బాబూ...దేవుడు చల్లగా చూడాలిగాని మిమ్మల్ని మటుకు..." అన్నాడు.

నా గుండె జలదరించింది. వాడి మాట పిడుగులా పడింది చెవిలో. ఎంత నవ్వుతూ చెప్పేశాడు...మళ్ళీ క్షణంలో తమాయించుకున్నాను.

మా వాడికి విసుగు తోచింది. "వాడితో ఏమిట్రా నీకు! ఇలాగే ఏదో ఒక అశుభం అనిపించుకోటం సరదా" అని నన్ను చివాట్లుపెట్టి, "పో అబ్బీ,




పో...మేం కారుకు ఫోనుచేశాం" అన్నాడు.

వాడి తీరు మారింది.

"అదేంటి బాబూ! కారెందుకూ... అదొచ్చేలోపు తీసుకుపోతాను...పరుగెత్తిస్తాను గిత్తని" అన్నాడు.

"ఉండరా బాబూ నువ్వు...నువ్వే మిత్రా పీడ" అని మా వాడు అంటూనే ఉన్నాడు ఆ కారు రానే వచ్చింది.

"ఏమి సార్...శీఘ్రంగా పోదాం" అన్నాడు డ్రైవరు.

"కొంచెంసేపు ఆగాలి" అన్నాడు మావాడు.

టాక్సీలోంచి ఎవరో దింపుతూన్నట్టు దిగింది వాడి తల్లి. ఆమె ముఖంలో, కళ్లలో జీవం లేదు. ఇళ్ళు నిప్పంటుకున్నప్పుడు, ఆ జ్వాలలకు చుట్టుప్రక్కల చెట్లు, చేమ కమిలిపోయినట్టుంది ఆమె ముఖం. నోట మాటలేదు. గందరగోళం లేదు. గుండె బాదుకోవటం లేదు. జీవశక్తులన్నీ దగ్ధమై, కేవలం ఆకారం మటుకు నిలిచి ఉన్నట్టుంది. ఆ కళ్లలోని దవానలంముందు, కార్చిచ్చు చిన్న నిప్పునలుసు. ఏడ్పుల్లో, పెడబొబ్బల్లో, – ఏదోవిధమైన ఒక ఉపశమనం! ఏదో బరువు తృణమాత్రమైనా తగ్గినట్టుకాని ఈ రోదన హీన. నిశ్శబ్దదుఃఖం, లోతులోతుకు, మరింత లోతుకు దించుకుపోయే పదునుకత్తి! ఆ నిబ్బరం, ఆ స్తబ్ధత, ఆ మౌనం చాటున, శతసప్త సముద్రముల ఘోష ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటుంది. ఆ దుఃఖము ఒకరికి వినికిడికి కాదు, ఒకరి ఓదార్పుకు కాదు. అది సహజీవి విచ్ఛేదంవల్ల

శరీరంలో అణువు అణువున చీల్చుకుని ఘోషించు భగ్నాత్మ వేదన! మృతినుంచి జనితమైన ఈ దుఃఖానికి మృతే ఓదార్పు!

కొడుకును గుండెకదుముకున్న ఆమె అశ్రువులు, జీవిత రహస్యాన్ని, సత్యాన్ని వ్యక్తంచేసే దుఃఖాక్షరాలు. గొడ్డలిపెట్టుకు చెట్టు అల్లల్లాడినట్టు ఆమె తల్లడిల్లింది.

"ఎంత పాపిష్టిదాన్ని!"

కారు డ్రైవరు తొందరచేస్తున్నాడు. మెల్లిగా శవాన్ని కారులో పడుకోపెట్టాము. ఎక్కడ దెబ్బతగిలిపోతుందో! చేతికెక్కడ కారు తలుపు గీచుకుంటుందో! మోకాలికెక్కడ దెబ్బ తగులుతుందో! నిర్జీవ ఆకృతి. కాని ఇంకా జీవించి ఉన్నట్టే మమత! నాకొక చిన్ననాటి విషయం గుర్తు వచ్చింది. ముసలి అవ్వ శవమును పాడెపై పరుండబెట్టి, ఆమె మెడను తాడుతో బిగించబోగా, ఆ వ్యక్తిని ఒక తోపుతోశాడు చూస్తూ ఉన్న కుర్రవాడు. ఆమె జీవించి ఉన్నట్టు, తాడు ఒరిపిడి కామె గొంతుక ఒరుసుకొని పోతుందని ఆ కుర్రవాని బాధ. ఆ పెద్దవ్యక్తి చిరునవ్వునవ్వి పాశబంధనం పూర్తి చేశాడు.

కారెక్కబోతున్నాం. ఆ తలపాగా వాడు నాకేసి, డ్రైవరుకేసి మహాతీక్షణంగా చూస్తూ, గొణుక్కుంటున్నాడు. వాడి చూపులకు నా గుండె మళ్ళీ జలదరించింది.

"నేనైతే మూడు రూపాయలకు తీసుకుపోయేవాడిని. ఇవ్వండి కారుకు పాతికరూపాయలు."

వాడి మాటల విసురు స్పష్టంగా వినబడింది.

ఆ ఒంటెద్దుబండి నల్లనిగూడు, ఆ ఎద్దు నల్లటి మూపురం, వాడి ఎరుపు అంచు తలపాగా, కారులో కూర్చున్న నా కళ్ళలో అనుక్షణం మెదులుతూనే ఉన్నాయ్!

"పొద్దూకులూ ఇక్కడే ఉంటాను."

"శవాలను జేరవేయటమే పని."

ఎంతో తాపీగా వాడన్న మాటలు నాకిప్పటికీ వినిపిస్తూనే ఉంటయ్. ఆప్తులు రోగుల గృహాగమనానికి ఎదురు చూస్తూ ఉంటే, ఇక్కడ, వీడు వారి శ్మశానాగమనానికి ఎదురు చూస్తూ ఉంటాడు. రోగులంటే వాడికి శత్రుత్వం లేదు. పైగా ఇష్టమే. ఎప్పుడు స్ట్రెచర్ శవమందిరంవైపు వస్తుందా అని చూస్తూ ఉంటాడు.

అది వాడి...!

